# జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

- ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థిస్తున్న గులాబీ శ్రేణులు
- ప్రజల నుంచి అపూర్వ స్పందన
- కారుగుర్తుకు ఓటు వేస్తామంటున్న ఓటర్లు
- ఎమ్మెల్యే అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం
- బీఆర్ఎస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రంగు సుమలత



ఎమ్మెల్సీ చల్లాను కలిసిన నామినేషన్ అభ్యర్థి ప్రేమలత, పల్లయ్య, తదితరులు



ఇంటింటికీ వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అయిజ, నవంబర్ 17 : పట్టణంలో బీఆర్ఎస్ ప్రచారం జోరందుకున్నది. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఓటర్లను కలుస్తూ బీఆర్ఎస్‌కు ఓటు ఓటేస్తే కలిగే లాభాలను, కాంగ్రెస్‌కు ఓటేస్తే కలిగే నష్టాలను వివరించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నదని, దేశంలోనే తెలంగాణను అగ్ర స్థానంలో నిలబెట్టిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మెచ్చి సబ్బండ వర్ణాలు స్వచ్ఛందగా మద్దతిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, గులాబీ పార్టీ పట్ల ప్రజల నుంచి అపూర్వస్పందన వస్తున్నదన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు నిరంతరం కొనసాగాలంటే సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అ సెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని ఇచ్చేందుకు కష్టపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కులవృత్తులను ఆదరించిన పార్టీకే మా మద్దతు

అలంపూర్, నవంబర్ 17 : రాష్ట్రంలో కులవృత్తులను ఆదుకుని, గొర్రెల యూనిట్లు పంపిణీ, దళితులకు దళితబంధు పథకం అమలుచేస్తున్న బీఆర్ఎస్‌కే మా మద్దతని టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, నామినేషన్ అభ్యర్థి ప్రేమలత అన్నారు. గురువారం రాత్రి ఎమ్మెల్సీ చల్లాను కలిసి పార్టీ నిర్ణయించిన అభ్యర్థి విజయుడికి మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పార్టీ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామన్నారు. చల్లా నాయకత్వంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్టు వారు ప్రకటించారు. కుర్వపల్లయ్యతో పాటు మాదారి, మాదాసి కుర్వ సంఘం ఠాగూర్ కృష్ణ, పెద్ద సోమన్న, మాజీసర్పంచ్ రా ముడు, లక్ష్మన్న, నర్సింహారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

### మహిళలకు ఆదరించిన బీఆర్ఎస్‌కే మన ఓటు

అలంపూర్, నవంబర్ 17 : మహిళలకు ఆదరించి అక్కున చేర్చుకున్న బీఆర్ఎస్‌కే మరోమారు ఓటు వేసి కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి సీఎం చేద్దామని బీఆర్ఎస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రంగు సుమలత అన్నారు. శుక్రవారం పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడికి మద్దతుగా ఎమ్మెల్సీ చల్లా ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వృద్ధాప్య, ఒంటరి మహిళా, దివ్యాంగుల పింఛన్ రెట్టింపు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పల్లె, పట్టణ ప్రగతి పథకాలతో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాయన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి కారుగుర్తుకు ఓటువేసి కేసీఆర్ సార్‌ను మరో మారు సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వకీల్ నారాయణరెడ్డి, దుబ్బ వెంకటేశ్వర్లు, జహీర్, దివాకర్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

### వార్డుల్లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

వడ్డేపల్లి, నవంబర్ 16 : పట్టణంలో చైర్‌పర్సన్ కరుణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా వార్డుల్లో శుక్రవారం ముమ్మురంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే రూ.10 కోట్లు ఖర్చు చేస్తున్నామని, మరో రూ.25 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఓటర్లు బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే అనేక అభివృద్ధి పనులు చేయవచ్చన్నారు. ఇప్పటికే సీసీ రోడ్లు, తాగునీటి సా కర్యాలు, డ్రైనేజీల ఏర్పాటు, మెరుగైన వి ద్యుత్‌ను ఏర్పాటు చేసుకోగలిగామని ఆ మె ఓటర్లకు తెలియజేశారు. కారుగుర్తు ఓ టు వేసి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బలపర్చిన అభ్యర్థి విజయుడిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో నాయకులు కౌన్సిలర్ ధనలక్ష్మి, శ్రీనివాస చౌదరి, వడ్డేపల్లి సూరి, తోట రవి, మాద న్న, రంగస్వామి పాల్గొన్నారు.



విజయుడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



అక్బర్‌పేటలో ప్రచారం చేస్తున్న రంగు సుమలత



శాంతినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ కరుణ

## ముగ్గులతో ఓటుహక్కుపై అవగాహన



ఓటుహక్కు అవగాహనలో పాల్గొన్న మహిళలు

అలంపూర్, నవంబర్ 17 : ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని లింగనవాయి గ్రామంలో మహిళా సంఘాలు, ఐకేపీ మహిళల ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ముగ్గులు వేసి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఓటు ప్రాముఖ్యత, వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు, ఏపీడీ సరోజ, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం పారిజాత, సీసీలు విజయలక్ష్మి, సునంద, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆశాబేగం, బుక్ కీపర్లు నాగలక్ష్మి, సీతమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఐకేపీ సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌బాబు

వడ్డేపల్లి, నవంబర్ 17 : శాంతినగర్‌లోని 19వ తేదీన ఎన్నికల ప్రచారంలో భాగంగా సభకు సీఎం కేసీఆర్ రానున్నారని బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ చల్లావెంకట్రామిరెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడుని ఆశీర్వదించడానికి ప్రజాఆశీర్వాద సభ నిర్వహిస్తారన్నారు. సభకు వచ్చే ప్రజలకు వాహనాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు, విద్యార్థి విభాగం నాయకులు, యువజన విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు భీమేశ్, యుగేంధర్, శివ, మోహన్, జై సింహ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన గురుకుల విద్యార్థులు

ఇటిక్యాల, నవంబర్ 17 : తెలంగాణ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 23 వరకు వరంగల్ జిల్లా మహమ్మదాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో సెపక్ తక్రా క్రీడావిభాగంలో పాఠశాలకు చెందిన ఆరుమంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు రంగస్వామి, ఉదయ్‌కిరణ్, విష్ణువర్ధన్, కార్తీక్, నిఖిల్, వీరభద్రలను రీజినల్ కోఆర్డినేటర్, ఫ్లోరెన్స్‌రాణి, జిల్లా కోఆర్డినేటర్ రఘులు అభినందించారు.

## అభ్యర్థుల ఖర్చుల వివరాలు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గద్వాల అర్బన్, నవంబర్ 17 : నియోజకవర్గ ఎన్నికల అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల నమోదు, బ్యాంకు అకౌంట్ నిర్వహణ, నిబంధనలపై, వివి ధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు, రిటర్నింగ్ అధికారి జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ అవగాహన కల్పించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఖర్చుల వివరాలు తప్పకుండా నమోదు చేయాలన్నారు. పార్ట్-ఏ, పార్ట్-బి, పార్ట్-సీ కాలమ్స్ పూర్తిగా ఖాళీలను నింపాలన్నారు. అభ్యర్థి అనుమతిలో ప్రచారం చేసే కార్యకర్తల ఖర్చుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ఎన్నికల అభ్యర్థుల ఫొటోలతో పాత సామగ్రి వాడినా, అనుమతి లేకుండా వాహనాలు ఉపయోగించినా కేసు నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు విజయ్‌భాస్కర్, నారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు

వడ్డేపల్లి, నవంబర్ 17 : శాంతినగర్‌లో ఆదినారాయస్వామి 36వ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదినారాయణస్వామి మనువడు చలపతిస్వామి హాజయ్యారు. ఈ సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని ఆరాధనోత్సవాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మహాత్ములచే ఉపన్యాసాలు, భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ద్రోణాచలం జమ్మన్న, భక్తులు వెంకట్రాముడు, సూరిబాబు, చిన్నలక్ష్మన్నగౌడ్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో సీఎం సభకు ఏర్పాట్లు

వడ్డేపల్లి, నవంబర్ 17 : శాంతినగర్‌లో ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగసభకు సీఎం కేసీఆర్ రానున్నారు. అందకుగాను వేదికను బీఆర్ఎస్ నేతలు సిద్ధం చేస్తున్నారు. మైదానంను చదును చేసి వేగవంతంగా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. సభకు సీఎం వస్తున్నందున సుమారు లక్షమందికి పైగా జనం వచ్చే అవకావమున్నందున అందుకు కావల్సిన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని సిద్ధం చేశారు. డీఎస్పీ, సీఐలు ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విషయాలను పరిశీలించారు.

### తనిఖీల్లో రూ.71,960 పట్టివేత

గద్వాల అర్బన్, నవంబర్ 17 : ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్టేషన్ పరిధితో పాటు సరిహద్దు చెక్‌పోస్టులలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం గద్వాల రూరల్ పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా ఎలాంటి రశీదులు లేకుండా రూ.71,960 తరలిస్తున్న నగదును పట్టుకొని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించారు. కాగా గురువారం తనిఖీలో పట్టుకున్న రూ.3,10,000 అప్పగించినట్లు తెలిపారు.

### ఆర్డీఎస్‌కు స్వల్ప వరద

అయిజ, నవంబర్ 17 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతోంది. శుక్రవారం ఆర్డీఎస్ ఆనకట్టకు 4,329 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 3,800 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 529 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.6 అడుగుల మేర నీటిమట్టం ఉన్న ట్లు ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వస్తున్న నీటితో ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు చెరువులను నింపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.